

చెట్టుకింద ప్లీడరు

కప్పగంతుల మల్లికార్జునరావు

వెంకట్రామయ్యంటే ఆవూళ్ళో చాలామందికి తెలియదు. అయితే 'చెట్టు కింద ప్లీడరు' అంటే ఎవరని, ఎవరినన్నా అడగకండి, సరాసరి ఆయన దగ్గరికే తీసికెళ్తారు.

వృత్తిచేత ప్లీడరు. ప్రవృత్తి చేత సాధువు. అమాయకత్వానికి మారుపేరు. ఇహ లోకసుఖాల మీద కన్నా పరలోకసుఖం మీద ప్రీతి జాస్తి.

అలాగని వెంకట్రామయ్య సర్వసంగ పరిత్యాగి అని చెప్పటానికి వీల్లేదు. ఆయనకీ కోరికలున్నాయి అంతర్గతంగా. అందులో రెంటిని గురించి చెప్పుకోవటం అవసరం. మొదటిది—తన కొడుకును గొప్పవ్యక్తిగా చేయాలి. రెండోది—తనేనాటికైనా న్యాయాన్ని తప్పని గొప్ప న్యాయవాదని అనిపించుకోవాలి.

వెంకట్రామయ్యకు భానుమూర్తి ఒక్కడే కొడుకు. భానుమూర్తి తండ్రి లాగే తెలివిగలవాడు. కాకపోతే యిద్దరికీ ఒకటే భేదం—వెంకట్రామయ్య తనగ్గల తెలివితేటలను తన వృద్ధికి వుపయోగించుకోలేకపోగా, భానుమూర్తి వాటి ఆధారంతో ఐ. ఎ. యస్. పరీక్ష పాసయి కలెక్టరయ్యాడు.

భానుమూర్తి కలెక్టరయిన రోజున వెంకట్రామయ్య ఆనందానికి అవధి లేకపోయింది ఎక్కడ దాక్కొని వుందో 'గర్వం' అన్న పదార్థం కూడా ఆయన్లో వో లేశం ఆరోజు కనిపించింది. తను ప్రాక్టీసులేని ప్లీడరు— తన కొడుకు కలెక్టరు!

బి. ఎల్. పాసై ఆవూళ్ళో ప్లీడరు బోర్డు కట్టిన రోజు, వెంకట్రామయ్య, ఆ వృత్తిలో 'షై' నవుతాడని ఆశించిన వాళ్ళు లేకపోలేదు. ఎందుకంటే బి. ఎల్. లో వెంకట్రామయ్య యూనివర్సిటీ ఫస్టు.

అయితే ఆవూరు అసలే 'లిటిగెంట్ల' మయం. రాష్ట్రంలో కల్లా తెలివితేటలు గల (అనగా జుట్టుకు, కాళ్లకు ముడులు పెట్టే తెలివి) ప్లీడరు గుమాస్తాలు ఆవూళ్ళోనే వున్నారు. నిజాని కావూళ్ళో ప్లీడర్ల కన్నా ప్లీడరు గుమాస్తాలకే 'లా' ఎక్కువగా తెల్సు! ఆ 'లా'ను యెలా తిప్పితే తమకనుకూలమవుతుందో, ఆ మెళుకువలూ తెల్సు'

వెంకట్రామయ్య దురదృష్టం కొద్దీ, అతను బోర్డు కట్టిన సంవత్సరమే, ఆ వూళ్ళోని పేరు పొందిన అయిదుగురు ప్లీడరు గుమాస్తాల కొడుకులు, ప్లీడర్లయి బోర్డులు కట్టేరు. ఇంకేం? పేరుకు వీరు ప్లీడర్లు. పని వారి తండ్రులది. గుమాస్తా తండ్రి, అంతా వ్రాసిస్తే కంఠతాపట్టి, కోర్టులో మర్నాడు వొప్ప చెప్పేవాడు కొడుకు. అందుకే వాళ్ళు బోర్డు కట్టిన రెండు సంవత్సరాలకే పేరు మోసిన ప్లీడర్లయ్యారు. వాళ్లల్లో వాళ్ళు పోటీలు పడుతూ, సీనియర్లతో కూడా పోటీ పడటం మొదలుపెట్టేరు.

వెంకట్రామయ్య కలాంటి అండదండలు లేవు. ఎప్పుడూ 'లా' పుస్తకాలలో మునిగి తేలుతం' వాడు. అందుకే పోటీ మొదటి రవుండులోనే వోడిపోయి వూరుకొన్నాడు.

మొదట్లో సీనియర్ ప్లీడరు ఒకటి రెండు కేసుల్ని తనకి వప్ప చెప్పేడు. అయితే ఆ కేసులు వెంకట్రామయ్యకు అన్యాయంగా తోచేయి. న్యాయవాది అయివుండి అన్యాయాన్ని సమర్థించటం ఆత్మవచన చేసుకోటం, దోషం, పాపం అనుకొన్నాడు. అనుకొని వూరుకొంటే ఎలాగుండేదో? సీనియర్‌తో అ. శాడు. ఆ సీనియర్ నవ్వి యిచ్చిన కేసుల్ని వెనక్కి తీసుకొన్నాడు.

ఆ తర్వాత రెండు కేసులొచ్చాయి వెంకట్రామయ్యకు. రెండూ న్యాయమైనవే. అయితే పార్టీలు

చాలా బీదవాళ్ళు. అందులో ఒకటి వోడిపోయింది. రెండోది గెలిచాడు. అయితే ఆ కేసు గెలవటం వల్ల వెంకట్రామయ్య పేరు పెరగ లేదు. కాగా తిరిగిందేమో! "నిజాన్ని నిజమని గెలిపించటం ఏ ముందోయ్? అబద్ధాన్ని నిజమని నిరూపించటంలోనే ప్లీడరు పస తెలుస్తుంది" తోటి ప్లీడరెవరో అంటుంటే విని నవ్వుకొన్నాడు.

కోర్టులో పనున్నా లేకపోయినా, పది గంటలకల్లా దేవతార్చన ముగించి, భోంచేసి, మొహాన గంధాక్షింతలు, వంటికి నల్లకోటు ధరించి, చేతులో ఏవో కాసిని కాగితాల్తో కోర్టు దగ్గర కనబడేవాడు వెంకట్రామయ్య.

మొదట్లో కాస్సేపు అలా 'బార్ రూం'లో పుస్తకాలు చదువుకొంటూ, కోర్టులో కేసులు వింటూ కాలక్షేపం చేసేవాడు. అయితే 'బార్'లో లాయర్ల ఆత్మస్తుతులు, అడపాతడపా పరనిందలను వింటూ, కోర్టులో సాక్షులు చెప్పే అబద్ధాలు వింటూ, ఎంతో కాలం ఆ పద్ధతిని కొనసాగించలేక పోయాడు.

కోర్టు కెదురుగా వో పెద్ద వేప చెట్టు వుంది. ఆ వేపచెట్టు కిందే ఓ హోటలు, చిన్న చిన్న రోడ్డు పక్కదుకాణాలూ వున్నాయి. కాస్త దూరంలో కాలేజీ, కొన్ని ఆఫీసులు కూడా వున్నాయి. కోర్టు పనిమీద, ఆఫీసు పనులమీద వచ్చేవారు, కాలేజీలో చదివేవారు, ఆ కాఫీ హోటల్లో కడుపు నింపుకొని, వేపచెట్టు నీడన్నిలబడి సేద తీర్చుకొంటూ, కబుర్లు చెప్పుకోటం ఆనవాయితీ. ఏతావాతా ఆ వూరి కా వేపచెట్టు ఓ పెద్ద 'సెంటర్' అని చెప్పుకోవచ్చు.

పేరు పొందిన ప్లీడర్లంతా ఆ సెంటరుకు అటూ యిటూగా, యెంత అద్దెైనా యిచ్చి ఆఫీసు లేర్పాటు చేసుకొన్నారు. వెంకట్రామయ్యకు వచ్చే ఆదాయం భుక్తికే సరిపోదు ఆఫీసూ, యిల్లూ అన్నీ ఒక్కటే! వెంకట్రామయ్య ఆ చెట్టు నీడను ఆశ్రయించాడు!

ఆ చెట్టు నీడనే ఆశ్రయించుకొని వున్న మరో వ్యక్తి శర్మ. శర్మ కొక వృత్తని చెప్పటానికివీల్లేదు. ఆయన స్టాంపువెండరు. పై వృత్తి, ప్రైవేట్లు—డాక్యుమెంట్లు అవీ వ్రాయటం.

కోర్టు జీవితంతో తలపై జుట్టు వూడిపోయింది. మనిషి నేలకు మూరెడు పొడుగు నుంటాడు. కరెక్టుగా చెప్పాలంటే ఆయన యెత్తు మూడడుగులు, మూడంగుళాలు! మూర్తి అంత చిన్నదైనా బుర్ర మాత్రం చాలా పెద్దది. అంత తెలివిగలవాడు ఆ ప్రాంతంలోనే కాదు ఎక్కడా లేరని ప్రతీతి. ఏదైనా కాగితం వ్రాశాడా, సుప్రీం కోర్టుకు పోయినా తిరుగుండదు. సలహా యిచ్చాడా హైకోర్టు కూడా తోసి పుచ్చటానికి వీల్లేనంత బలంగా వుంటుంది.

శర్మ, ఆ చెట్టు కిందే, పక్క నున్న వో పాత పెంకుటింట్లో నివాసం. చెట్టే లేకపోతే, ఆ యిల్లు సర్వభూతాలకు నిలయమని చెప్పవచ్చు.

ప్రొద్దున యెనిమిది గంటలకల్లా స్నానం సంధ్యావందనం ముగించి మొహాన విభూతి, కుంకుమ ధరించి వరండాలోకొచ్చి తన చిన్నబల్ల యెదుట కూర్చుంటాడు శర్మ కూర్చోగానే పక్క హోటల్లోనుంచి అరడజను యిడ్లీలు వస్తాయి. అవితిని, కాఫీతాగి పనికుపక్రమించాడా, రాత్రి ఏ తొమ్మిదింటికో లేచేది. మధ్యలో భోజనానికో అరగంట—

ఏమీ తోచక అక్కడ కూర్చోటానికి పోయేవాడు వెంకట్రామయ్య. క్రమంగా శర్మతో స్నేహం పెరిగింది.

ఊరికే కూర్చో లేక వోరోజు వెంకట్రామయ్యే అడిగాడు— 'నాకేదైనా పనివుంటే చెప్పవయ్యా శర్మా—' అని అంతే ..... ఆమరునాటినుంచి వెంకట్రామయ్యకు చేతినిండా పని. పనికితగ్గ రాబడి.

వెంకట్రామయ్య వ్రాసిన ప్రతిడాక్యుమెంటుని శర్మ చూచేవాడు. అవసరమైతే సరిచేసేవాడు కూడా. అది వ్రాయించుకొన్నవాళ్ళకూ కూడా శర్మ చూడందే తృప్తిలేదు.

అయితేనేం? వెంకట్రామయ్య గౌరవ ప్రతిపత్తులకేం భంగం కలగ్గుండా చూచేవాడు శర్మ. ఆయనగ్గావో కుర్చీ, బల్లా వేయించాడు. అందులో వెంకట్రామయ్య ప్లీడరులా కూర్చుంటే, శర్మ ప్లీడరు గుమాస్తాలా చాపమీద, చిన్నబల్లముందు కూర్చునేవాడు.

'ప్లీడరు వ్రాసినదాన్ని, గుమాస్తా సరిదిద్దుతాడు రోజా'—అని కొందరు ఎగతాళిగా అన్నా వెంకట్రామయ్య పట్టించుకోలేదు.

కాలం గడుస్తున్న కొద్దీ వెంకట్రామయ్యకు డాక్యుమెంట్లు వ్రాయటంలో చెయ్యి తిరిగింది. డబ్బుకు వెనకటిలా కష్టపడాల్సిన అవసరంలేకపోయింది. కొడుకు చదువు నిరాటంకంగా సాగుతోంది.

ఇలా ఆ చెట్టును ఆశ్రయించి బ్రతుకుతున్న వాళ్లలో వెంకట్రామయ్య కూడా చేరేడు. ఎప్పుడో వచ్చిన, 'చెట్టుకింద ప్లీడరు' అన్న బిరుదం అక్షరాలా ఖాయంగా నిల్చి పోయిందాయనకు!

* * *

ఎలాగోలాగు దిగుల్లేకుండా అలవాటుగా సాగుతున్న వెంకట్రామయ్య జీవితకథ, భానుమూర్తి కలెక్టరుగా కావటంతో మారక తప్పదా అనిపించింది.

భానుమూర్తి చిన్నతనంనుంచీ బాధ్యతలు తెల్సినవాడు. తండ్రికి ఒక్కడే కొడుకైనా, గారాబంగానే పెంచబడ్డా, తన తండ్రి పడుతున్న కష్టాలను కళ్ళారా చూచినవాడు.

తనతండ్రి తెలివి కలవాడు. అయితే ఆతెలివి ప్లీడరు వృత్తిలో రాణించలేదు. ధనార్జనే ఆయన జీవిత ధ్యేయంగా పెటుకోలేదు. ఆయన మనసు బుద్ధి, ఎప్పుడు వేదాంత విషయాలమీదే వుండేది. కోర్టులోకాని, భల్లోకాని ఆయన పెద్దగా మాట్లాడలేక పోవచ్చు. అయితే ఆయన పాండితి, ప్రజ్ఞ భానుమూర్తికి బాగా తెల్సు.

అటువంటి తనతండ్రి తనకోసం ప్లీడరైవుండి కూడా డాక్యుమెంట్లు వ్రాసి సంపాదించి తనని చదివించాడు. తను కష్టాలుపడుతూ, తనకుమార్గదర్శక మయ్యాడు.

నిజానికి వెంకట్రామయ్యే కనుక పెద్దలాయరై రెండుచేతులా డబ్బు సంపాదిస్తున్నట్లయితే భానుమూర్తి కలెక్టరు కాలేక పోయేవాడేమో! తండ్రి కష్టాలు కళ్ళారా చూస్తూ. 'చెట్టుక్రింద ప్లీడరు' అని ఆయన్నంతా ఎగతాళిగా అనటాన్ని వింటూ అందులోనుంచి పౌరుషాన్ని పట్టుదలను పెంచుకొన్నాడతను. చిన్ననాటి ఆ అనుభవం అతనికి లోకానుభవాన్నిచ్చింది. ఆలోచనా శక్తిని, పెంపొందించింది.

తను ఐ.ఎ.యస్. పాస కాగానే తండ్రి కష్టాలు గట్టెక్కే కాలం వచ్చిందని సంతోషించాడు భానుమూర్తి. ఇక తన తండ్రి పొద్దస్తమానం ఆచెట్టు కింద పాతకోటుతో పడుండాల్సిన అవసరం లేదు. నలుగురుచేత 'చెట్టుకిందప్లీడరు' అనిపించుకోవాల్సిన అవసరమూ లేదు. ఆయనిక కలెక్టరుగారి తండ్రి. ఆయన్ని చూచి నవ్విన వాళ్ళే, యిక ఆయనకు వంగి వంగి నమస్కరించాలి.......యిలా ఆలోచించాడు భానుమూర్తి.

తండ్రితో తన ఆలోచనలను చెప్పేడు భానుమూర్తి. ఆయన కొడుకు వైపు వాత్సల్యపూర్వకంగా చూచి ఆనందంగా నవ్వేడు.

'తప్పదు నాన్నగారూ......మీరిక యీవృత్తిని మానేసి విశ్రాంతి తీసికోవాలి—'

'నువ్వు ప్రయోజకుడివైనందుకు సంతోషం నాయనా. కాని అన్నిటికీ ఆ పరమాత్మ వున్నాడు. కానియ్ ... ఆయన ఎలా నడిపిస్తే అలానడుద్దాం—' కొడుకు తలను ప్రేమగా నిమురుతూ అన్నాడు వెంకట్రామయ్య. ఆ మాటల్ని అంగీకారంగానే తీసి కొన్నాడు భానుమూర్తి.

కలెక్టరుగా పోస్టింగ్ మరోజిల్లాలో వో తాలూకాలో వచ్చింది. పెద్ద బంగళా.... నౌకర్లు..... తలిదండ్రులకు కావల్సినంత ప్రశాంతత.... విశ్రాంతి.

తలిదండ్రులను తీసికుపోవటానికొచ్చిన భానుమూర్తికి నిరాశే యెదురయింది. తల్లి—కొడుకు నొదిలి వుండటానికి ఇష్టం లేక యిల్లు వదల్టానికి సిద్ధపడ్డా, వెంకట్రామయ్య మాత్రం అందుకు సిద్ధపడలేదు.

''ఇది నా నేలరా నాయనా. యిక్కడే పుట్టేను. పెరిగేను. సుఖాలను కష్టాలను అనుభవించాను. ఆచెట్టు—కోర్టు దగ్గర ఆవేప చెట్టు వుంది చూచావా నాయనా— అది నాకు ప్రాణం. నన్ను 'చెట్టు కింద ప్లీడరు'ను చేసిందా చెట్టే. నాలో ఆలోచనలను కలిగించిందా చెట్టే. అర్ధంకాని ఎన్నో జీవిత సమస్యలకు, జవాబులనిచ్చిందా చెట్టునీడే. ఆఖరికి నాకు దారి చూపించి తిండిపెట్టిందీ ఆ చెట్టే నాయనా. నేనీవూరిని, ఆచెట్టు నీడనూ వదిలి రాలేను నాయనా—'అన్నాడు వెంకట్రామయ్య.

'మిమ్మల్ని గౌరవించలేని, మీ ప్రతిభను గుర్తించలేని, మనుష్యులున్న యీ వూరిమీద మీకెందుకు నాన్నగారూ అంత మమకారం?'

వెంకట్రామయ్య కొడుకు ప్రశ్నకు జవాబివ్వలేదు. సమాధానంగా అతని వైపుచూచి నవ్వేడు. ఆనవ్వులో వేదాంతం వుంది. వాత్సల్యం వుంది—ప్రేమవుంది —పెద్దరికం వుంది. 'మీతరంవారికి

ఆ మమకారాలు తెలియవులే. అదిచెప్తే తెల్సేదికాదు. అనుభవైకవేద్యం' అన్నట్లు అర్థం చేసుకున్నాడు భానుమూర్తి. అందుకే మరిక వత్తిడి చేయకుండా వెళ్లిపోయాడు.

ఆరునెలల తర్వాత భానుమూర్తి బదిలీ అయి, కలెక్టరుగా ఆవూరికే రావటంతో కథ మరోమలుపు తిరక్క తప్పిందికాదు.

నిజానికా ఆరునెలలూ భానుమూర్తి బాధగానే గడిపాడు. సుఖించటానికి ప్రభుత్వం వారు కల్పించిన అవకాశాలున్నా, వాటిని వినియోగించుకోలేదతను. తన తలిదండ్రులు అనుభవించని సుఖాలు తనకెందుకు? అక్కడవాళ్లు చాలీచాలని, యింట్లో చేసుకోలేక, బాధపడ్తుంటే, యిక్కడ తను బంగాళాలో, నౌకర్లచేత పనులు చేయించుకొంటూ సుఖపడాలా?...... అతని, సంస్కారం, తలిదండ్రులపై గల గౌరవం, ప్రేమ అందుకంగీకరించలేదు.

తన దగ్గరికి తలిదండ్రులు రారు. కనుక తనేవాళ్ల వద్దకెళ్లి కొంతకాలం పాట్లైనా వుండి వాళ్లని సుఖపెట్టాలి. నాన్నగారి జీవిత విధానాన్ని మార్చాలి. అందుకే బదిలీకోసం ప్రయత్నించాడు.

వాస్తవానికి — కొడుకు కలెక్టరయినా, వెంకట్రామయ్య జీవితమార్గం పిసరంత కూడా మారలేదు అదే పాత నల్లకోటు..... అదే పాత యిల్లు.... అదేచెట్టు ..... కుర్చీ...... బల్ల...... అదే పని.....! ఆయన్ని గురించి అవే మాటలు, హాస్యాలు, బిరుదాలు అన్నీ అవే!

భానుమూర్తి కలెక్టరుగా ఆవూరు వచ్చినరోజే, అనుకోని కొత్తసమస్య ఎదురయింది—

కలెక్టరుగా— భానుమూర్తి ప్రభుత్వం వారిచ్చిన బంగళాలో వుండవల్సి వుంది. కానీ అదేవూళ్లో తలిదండ్రులు పాతయింట్లో వుండగా, తను—బంగళాలో వుండలేడు. వాళ్లను బంగళాకు రమ్మనక తప్పలేదు.

వెంకట్రామయ్య వుండే యిల్లు పాతది. పిత్రార్జితంగా వచ్చిన ఆస్తి. యాభైయేళ్ల వెంకట్రా

చెట్టుకింద పీడరు

మయ్య హయాంలో అది మరింత పాత బడింది. ఆయనా యింటికి మరమ్మత్తు లేవీ చేయించలేదు సరికదా, నవనాగరికమైన అవసరాలు కల్పించలేదు. పంకాలులేవు— సోఫాలులేవు— తగినన్ని కుర్చీలు కూడా లేవు.

అయితే వెంకట్రామయ్యకు, తన తాత తండ్రులు జీవించిన యింట్లోనే తానూ జీవిస్తున్నా నన్న తృప్తిమాత్రం వుంది. ఇప్పుడు దాన్ని వదులుకు రమ్మంటున్నాడు కొడుకు. ఆత్మానందాన్ని పరిపూర్ణంగా యిచ్చే ఆ తృప్తికన్నా, భౌతికానందాల నిచ్చే భోగాలు తనకు సుఖాన్నివ్వగలవా? లేనే సమాధానం చెప్పింది అంతరాత్మ.

తండ్రి చెప్పిందీ కాదనటానిక్కారణం కనిపించలేదు భానుమూర్తికి. సుఖం పేరిట, తండ్రి అనుభవించే ఆత్మనందాన్ని వదులుకోమనే అధికారం తనకేముంది? కాని వాళ్లను వదిలేసి తనొక్కడూ వుండగలడా?

పరిష్కార మార్గం వెంకట్రామయ్య చెప్పేడు— "కంటియెదుటే వుంటావ్. అంతకన్నా మాక్కావల్సిందేముందిరా? నీవు యీ యింట్లోనే వుందామనుకున్నా, నీ అధికార వ్యవహారాలకు యీ యిల్లు చాలదు. ఇక నీ ఒంటరితనమంటావా? ..... త్వరలో నిన్నొక యింటివాడిని చేస్తే......" ఆనందం నిండిన ఆయన హృదయం నుంచి మాట పెగల్లేదు.

'అంటే— నా కెవర్నో తగిలించి మీరు తప్పుకుంటారన్నమాట!'

నోటిమీద తర్జనిని చూపిస్తూ, 'అలా అనకూడదు నాయనా' అన్నట్లు తలవూచాడు వెంకట్రామయ్య— "నీవు కలెక్టరువయ్యావు. ఈ వంశానికి పేరు తెచ్చావ్. అది మేంచేసుకున్న అదృష్టం. కానీ యిది జీవితంలో ఒక భాగం మాత్రమే భానూ. ఇంతకన్నా కూడా అవసరమైనది సంసార జీవితం. నువ్వు సంసారివై, పిల్లాపాపలతో వుంటే చూచి ఆనందించాలను కోటం తప్పుకాదు నాయనా. అది మేము తప్పుకోవటం కాదు— నిన్ను నిరాదరించటమూ కాదు. తలిదండ్రులుగా అది మా కర్తవ్యం—'

ప్రేమ, గౌరవం, భక్తి, కృతజ్ఞత, ఆనందం పెల్లుబికిరాగా, భానుమూర్తి హృదయం భాష్పాలను రాల్చింది. ఆ భాష్పాలతో తండ్రికాళ్లు కడిగి కళ్ల కద్దుకొన్నాడు.

మరుసటి రోజే భానుమూర్తి తనకు నిర్దేశించిన బంగళాలో చేరేడు. అయితే సమస్య అంతటితో అంతంకాలేదు. కాగా మరుసటి రోజునుంచి మరిన్ని సమస్యలు యెదురయ్యాయి భానుమూర్తికి.

తనావూరి కలెక్టరు కనుక, తన తండ్రి యిక పాతజీవితానికి స్వస్తి చెప్తాడని ఆశించాడు భానుమూర్తి. అయితే వెంకట్రామయ్య కనీసం తనపాత కోటుకూడా విడవలేదు. భానుమూర్తి కలెక్టరుగా కారులో ఆఫీసుకు పోయిన రోజునే, వెంకట్రామయ్య అలవాటు ప్రకారం కాళ్లతో నడిచి కోర్టు ముందు చెట్టుకింద తన స్థానానికి వెళ్లాడు.

కలెక్టరు బంగళానుంచి, కలెక్టరాఫీసుకు వెళ్లాలంటే, ఆసెంటరుమీద గుండానే వెళ్లాలి. తన తండ్రి, ఆపాత యింట్లో, ముసలి కుర్చీలో విరిగిన కళ్లజోడు ధరించి కూర్చొని వుండటం, సాయంత్రం అయిదు గంటలకు జీపులో బంగళాకు వెళ్తూ చూచాడు భానుమూర్తి. చివుక్కు మంది అతని హృదయం.

ఆరాత్రి తండ్రిని కలుద్దామనుకొన్నాడు. వీలు కాలేదు—

మరుసటిరోజు ప్రొద్దున పది గంటలకు భానుమూర్తి ఆఫీసుకెళ్తున్నాడు. వయోభారంతో అనారోగ్యం వల్ల నడవలేక నడవలేక నడిచి వెళ్తున్న తండ్రి కన్పించాడు. మనసు బాధతో మూలిగింది.

జీపు ఆపి ఆయన్ని పలకరించి, ఎక్కించుకొని వెళ్లాలా? చూచీచూడనట్లు వెళ్లాలా? మొదటిది తన ధర్మం కొడుగ్గా— రెండోది అధికారిగా తన హోదా. ఒకవేళ ఆపి యెక్కమంటే— ఎక్కనంటే?

ఆలోచనలో వుండగానే ఆయన దగ్గరి కెళ్లింది జీపు. అనుకోకుండానే ఆపించాడు. దిగి 'నాన్నగారూ' అని పిల్చాడు.

వెంకట్రామయ్య కొడుకుని ఆసమయంలో అలాంటి స్థితిలో చూచి నివ్వెరపోయాడు. ఆతర్వాత ఆఫీసరు హోదావున్న అతన్ని చూచి మురిసిపోయాడు. అంతా ఒక్క క్షణం మాత్రమే. మరుక్షణంలో ఆయనకి పరిస్థితి జ్ఞాపకం వచ్చింది. కొడుకు కలెక్టరు— తను ఎంత తండ్రైనా రోడ్డులో నిలబెట్టి మాట్లాడటం కొడుకు హోదాకు, గౌరవానికి క్షేమం కాదు.

"ఆఫీసుకు వెళ్తున్నావా నాయనా. టయిమయిందేమో పోయిరా. నేనిక్కడికేలే—" అన్నాడు— 'నీదోవ న్నీవెళ్లు' ధోరణిలో అనటమేమిటి, కొడుకును జీపులో కూర్చోనేలా చేయటమేమిటి, తను వెళ్లటమేమిటి నిముషంలో జరిగేయి.



వేసవి
కాలములో
వర్త
బాధలను పొందకుండుటకు



సల్ ఫర్
టాయిలెట్ సోప్
మొటిమలు, చెమట పొక్కులు, వ్యాపకమైన యితర చర్మ బాధ లను పోగొట్టి సుఖము నిచ్చును.

BENGAL CHEMICAL
CALCUTTA-BOMBAY-KANPUR

చెట్టుకింద ప్లీడరు

'చెట్టుకింద ప్లీడరు పంట పండిందిరోయ్—'

'కలెక్టరు నాయనకాదూ ఎలాగైనా?'

నవ్వులు—

'ఆ పాత గొను తీసేస్తే చూడాలని వుందిరా ఆయన్ని—'

'ఆయన సంపాదనంతా ఆ బొంతలోనే దాచి పెట్టేట్టు!'

'ఇంకా ఎందుకు పాపం యీ ముసలాయనకి చెట్టుకింద సేవ'

'అలవాటైన ప్రాణం కదుటయ్యా పాపం—'

వెంకట్రామయ్య చెవులు అన్నీ విన్నాయి. అయితే అతని మనసు మాత్రం వినవట్లే—

భానుమూర్తి కూడా త్వరలోనే తెల్సుకొన్నాడు—తన విషయం, తండ్రి 'విషయం చర్చనీయాంశంగా మారుతోందని—

'అయినా యెంత తండ్రైతేమాత్రం కలెక్టరయి వుండి అలా రోడ్డులో నిలబడి మాట్లాడటమేనా ?'

'పుత్రధర్మంరా బాబూ!..... పుత్రధర్మం—'

విన్న భానుమూర్తి నవ్వుకొన్నాడు. ఆ ధర్మ మేమిటో వీళ్లకేం తెలుసుంది? అధికారం వచ్చినంత మాత్రాన, తలిదండ్రులమీద, పెద్దలమీద గౌరవం పోవాలా? వాళ్ల ఎదుటే విచ్చలవిడిగా ప్రవర్తించాలా!......అధికారానికి అర్థం అదికాదు.... నాగరికతకు తాత్పర్యం అదికాదురా బాబూ..... మన సనాతన ఆచారం, ధర్మంతా అది. దాన్ని మాత్రం మర్చిపోకూడదురాబాబూ .... అని అరిచి చెప్పాలనిపించింది భానుమూర్తికి.

ఆరాత్రి వ్వంత యింటి కెళ్లేడు భానుమూర్తి. తండ్రి యేదో 'లా'పుస్తకం చదువుతున్నాడు.

కొడుకును చూచి తండ్రి ఆహ్వానించాడు. కాస్సేపు మౌనం—

"నాన్నగారూ— యిక మీరీ వద్దతిని మానెయ్యకూడదూ?"

'ఎందుకురా బాబూ? యిప్పుడేం వచ్చింది నాకు. ఒంట్లో ఓపిక వుంది. యింట్లో తోచమాతోచదు.

'హాయిగా 'కృష్ణారామా' అనుకొంటూ, ఏదన్నా పుస్తకాలు చదువుకొంటూ ప్రశాంతంగా వుండ కూడదా నాన్నగారూ? యీ వయస్సులో మీకీ శ్రమ ఎందుకు?'

వెంకట్రామయ్య స్వచ్ఛంగా నవ్వేడు. 'ఇంతే నట్రా నాయనా నీ కారణాలు? యింతేనా?' ఒక క్షణం సేపు మౌనంగా వుండి తిరిగి ఆయనే అన్నాడు మెల్లగా—

'నాకు తెల్సు భానూ. వీటికి తోడు యింకా కొన్ని కారణాలున్నాయి—'

'నాన్నగారూ' భానుమూర్తి హృదయం జాలిగా పిల్చింది.

'నాకు తెల్సునాయనా. నువ్వు కలెక్టరువు. నా మీద ప్రేమకొద్దీ నాకు చెప్పకుండానే యీవూరు వేయించుకొని వచ్చావ్. కాని చూడు నాయనా యిక్కడే నువ్వు పొరపాటు పడ్డావ్. నా సుఖాన్ని, నీ దృష్టితోనే ఆలోచించావు కాని, నాదృష్టిలో ఆలో

చించలేకపోయావ్—'

భానుమూర్తి తండ్రివైపు నివ్వెరపోయి చూచాడు.

'నీవు అనుభవిస్తున్న వేదనను నేనూహించగలను భానూ. నన్ను కాలు కదల్చనీయకుండా సేవ చేయాలని నీ అభిలాష. కానీ తిరిగిన కాలు నాయనా —కట్టివేస్తే కొట్టివేసినట్లే బాధపడుతుంది. పెంచి పెద్దచేసి ప్రయోజకుడిని చేసిన మాకేమీ సుఖాన్ని ఇవ్వలేకపోతున్నానే, మా ఋణాన్ని తీర్చలేక పోతున్నానే అని నీబాధ. కానీ భానూ... ప్రతిఫలాన్ని కాంక్షించేదిట్రా తలిదండ్రుల ప్రేమ. నన్నంతా 'చెట్టుక్రింద ప్లీడరు' అంటారని నీ బాధ. అయితే భానూ.... అలా పిలుస్తే నేనెంత ఆనందిస్తానో నీకు తెలీదు. అది నా పేరురా. ఆ పేరుతో నాకు ఆ చెట్టుకుగల అనుబంధం వుంది. ......ఆపాతకోటు వదలాలని అందరి లాగానే నీ ఆకాంక్ష. అయితే యిన్నాళ్లూ కొనుక్కోలేక కాదురా కోటు కుట్టించుకోంది— ఆకోటుమీద ప్రేమకొద్దీనని ఎవరికీ తెలియదు. ప్లీడరు బోర్డు తగిలించిన్నాడు తొడిగానా కోటును ప్రప్రథమంగా.ముప్పైయేళ్ళు గడిచిపోయింది. అయితే యిన్నేళ్లలో గెలిచింది ఒకే ఒక్క కేసు. ఒక్కకేసు గెలిచిన ప్లీడరుకు పది కోట్లెందుకురా? మళ్లీ ఎప్పటికైనా ప్లీడరుగా కేసు గెలవాలి. ఆకోటు మార్చాలి. లేదా ఆకోటుతోనే కడదేరిపోవాలి—"

భానుమూర్తి మనసులో ఎన్నెన్నో భావనలు..... హృదయానికెంతెంతో అనుభూతి...... మెదడుకెంతెంతో విజ్ఞానం.........

"నాయనా భానూ. పెద్దవాడిగా —అనుభవంతో పండిపోయి చెప్తున్నానురా. సంతోషం, ఆనందం అన్నవి ఎక్కడో లేవు. మన మనసుల్లోనే వున్నాయి. ఒకళ్లు మనల్ని ఏదో అంటున్నారని బాధపడేదానికన్నా, అది సత్యమైనప్పుడు స్వీకరించటం, అసత్యమైనప్పుడు తేలిగ్గా నవ్విపారేయటం నేర్చుకోవాలి. ఎవరో ఎగతాళి చేస్తారని మన పద్ధతుల్ని మార్చుకోవటం ఎందుకు? మన సంప్రదాయాలకు, అలవాట్లకు స్వస్తి చెప్పటం ఎందుకు? అనవియ్ బాబూ...... లోకంలో జనం లక్ష అనుకొంటారు. అందుకు బాధ పడుతుంటే దానికి అంతెప్పటికి?"

భానుమూర్తికి జ్ఞానోదయమైనట్లయింది. తనెంత పొరపాటు చేశాడు. విషయాలను తనెంత వక్రంగా వూహించుకొన్నాడు? ...... చెట్టుక్రింద ప్లీడరుగా ఎగతాళి చేయబడే తండ్రి, జీవిత దృక్పధానికి కలెక్టరుగా గౌరవించబడే తన ఆలోచనలకి ఎంత వ్యత్యాసం వుంది?

ఆ విషయాలని గురించి ఆతర్వాత ఆలోచించటం మానేసేడు భానుమూర్తి.

అయితే జనం మాత్రం ఆ తండ్రీ కొడుకుల కధలను కరకాల వర్ణనలతో చెప్పుకో సాగేరు.

* * *

వెంకట్రామయ్య జీవితకధ అలాగే సాగిపోతే ఎలాగుండేదో? కానీ అలా సాగిపోలేదు. ఆయనకి మళ్లీ కేసులు రావటంతో కథ మరో మలుపు తిరిగింది.

ముప్పైయేళ్లతర్వాత తిరిగి కోర్టులోకివెళ్తున్నప్పుడు ఆయన గర్వాన్నికాని, సిగ్గునుకాని పొంద

ఏజెంట్లు కావలెను

30% కమిషన్ మీద ప్రఖ్యాత "ఎవ్కార్ట్" 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్లు



విక్రయించుటకు ఏజెంట్లు కావలెను. ఉచిత షరతులకు, కాంపిలు (అప్లికేషన్)కై వెంటనే వ్రాయండి.

JAPCO, (APWM-27)
P.O. Box 1382, Delhi—6.

లేదు. అదే నల్లకోటు వేసుకొని రోజూ కోర్టుకు పోయే వాడిలాగానే వెళ్ళేడు.

కోర్టులోనేకాదు యివతల ఆయన పద్ధతి మారలేదు. శర్మపోయిన తర్వాత వెంకట్రామయ్య ఆయన స్థానాన్ని ఆక్రమించినా, యింకో ప్రైవేట్లు వ్యక్తి ఆయన పనులు చేస్తున్నాడు. కోర్టు కేసులొచ్చాక, ఆయన వెంకట్రామయ్య గుమాస్తా కూడా అయ్యాడు. అదే అన్నిటి ఆఫీసు. న్యాయమనుకొన్న కేసునే చేపట్టటం?

న్యాయానికాలం వచ్చినట్లుంది. వెంకట్రామయ్య పట్టిన మొదటి కేసుగెల్చింది. 'కలెక్టరు గారి నాయన కాదుట్రా?' అనుకొన్నారు గిట్టని వాళ్ళు. అయితే కేసులో ఆయన వాదనను విన్న వారుమాత్రం 'ఫర్వాలేదురోయ్— చెట్టుకింద ప్లీడరు కూడా బాగా వాదించగలడే' అనుకొన్నారు.

రెండోదీ గెలిచాడు. అయినా పాతకోటు. పాత స్థలం మారలేదు.

మూడోది వోడిపోయాడు. నాలుగోది.....

నాలుగోదాని దగ్గరే సందిగ్ధం వచ్చింది వెంకట్రామయ్యకు. ఆ కేసు న్యాయమైనదో, కాదో యిదమిద్ధంగా తేల్చుకోలేక పోయాడు. ఏమయితేనేం? ఆకేసూ గెలిచాడు కిందికోర్టులో. అవతలి పక్షం వాళ్ళు బాగా వున్నవాళ్ళు. అప్పీలుకు పోయారు. మేజర్ అప్పీలు కావటంవల్ల కలెక్టరు దగ్గరికెళ్ళింది.

ఇదివిని భానుమూర్తి బాధపడ్డాడు.

'నాన్నగారూ.... యీ కేసునుంచి మీరు తప్పుకోండి' అన్నాడు.

'ఎందుకు?' ప్రశ్న.

మీ న్యాయ దృక్పథాన్ని, నిష్ఠతను పరీక్షించి నిర్ణయించే అర్హత నాకు లేదు. అది నాకు సిగ్గుచేటు —చేతకాదు—'

నవ్వేడాయన— 'అది నీ బాధ్యత— యిది నా కర్తవ్యం. నేను వాదించాల్సిన వాడిని, నువ్వు తీర్పివ్వాల్సినవాడివి. మన ధర్మాన్ని మనం నిర్వర్తించటానికి సిగ్గుపడాల్సిన అవసరం లేదు. నీ కర్తవ్యం నువ్వు నిర్వహించు. స్వయం బుద్ధితో, తన మన అన్న ఆలోచనను విడనాడి, ధైర్యంగా నిర్ణయాలివ్వటం నేర్చుకోటం అవసరం—'

కేసు జరిగింది. రెండు పక్షాల వాదనలను విన్నాడు కలెక్టరు!

తీర్పిచ్చేవాడు కొడుకు. ఒకపక్షాన వాదించేవాడు తండ్రి. ప్రజల్లోకూడా కేసు పట్ల వుత్సాహం, ఆత్రుత కలిగింది.

తండ్రి ప్లీడరుగా రాణించక పోవటానికి కారణమేమిటో భానుమూర్తికి వాదనలన్నీ విన్నాక తెల్సింది. ఆయనకి న్యాయ మొక్కటే తెల్సు. అన్యాయం అంటే ఏమిటో తెల్సినా దాన్ని గురించి ఆలోచించటం అధర్మమన్న నమ్మకం కలవాడు. అయితే, న్యాయ విషయాలతో పాటు, అన్యాయాలు కూడా తెల్సిన వాడే, దాన్తో పోరాడే నేర్పుగల వాడే, దాన్ని జయించ గలడు. లేకపోతే దాని చేతుల్లో వోటమి తప్పదు.

తనకి తెల్సిన న్యాయాన్ని ఖచ్చితంగా చెప్పగలడు కాని, అన్యాయాన్ని ఎదిరించి వోడించే నేర్పులేదు. అబద్ధం ఆడలేడు. అవతల సాక్షిచేత అబద్ధాన్ని చెప్పించే నేర్పసలులేదు. నిజానికి అబద్ధపు రంగు, అబద్ధానికి నిజపురంగునుపూసి, చిత్రించే నేర్పు బొత్తిగా లేదు.

ఆరోజు కేసు తీర్పివ్వాల్సినరోజు. కోర్టు జనంతో కిక్కిరిసి వుంది. గెలుపు వోటముల మీద పందేలు వేసుకొన్నారు కొందరు.

భానుమూర్తి అందరివైపు వో మారు చూచాడు. అందరికళ్ళు అతనిమీదే కేంద్రీకృతమై వున్నాయి. అందరిలో అతనికపించంది వెంకట్రామయ్యే!

భానుమూర్తి కర్థమైంది— తండ్రి కావాలనే ఆరోజు రాలేదని, తను వస్తే కొడుకు కర్తవ్య నిర్వహణలో పొరపాటు చేస్తాడేమోనని వూహించి వుంటాడు. మనసులోనే ఆయనికి నమస్కరించాడు.

తీర్పు చదవటం అయ్యేసరికి అంతా నివ్వెర పోయారు. వెంకట్రామయ్య పక్షం వోడిపోయింది!

కొందరు భానుమూర్తి న్యాయనిష్ఠను పొగిడితే, మరికొందరు 'ఆ— యిదంతా నాటకం లే' అన్నారు.

ఆ సాయంత్రం జీపులో బంగళాకెళ్తూ యిదే విషయం ఆలోచిస్తున్నాడు భానుమూర్తి..... తండ్రికి న్యాయం తప్పని న్యాయవాదికావాలన్న కోరిక వుందని తనకు తెల్సు. ఇప్పుడీ కేసులో వోటమితో ప్లీడరుగా ఆయన భవిష్యత్తు తిరిగి చెట్టు క్రిందికి రావచ్చు. అయితేనేం? .....యిది ఓడిపోవటం వల్ల ఆయన నిజమైన న్యాయవాది అవుతాడు. అన్యాయాన్ని, తనకు తెలీకుండానే న్యాయమని వాదించిన ప్రథమకేసు యిదేనేమో ఆయన జీవితంలో. యిదే గెల్చి వుంటే ఆయన చేతులారా అన్యాయానికి ఆసరా యిచ్చినట్లు. ఓడి పోయినందుకు ఆయన బాధపడ్తారో, సంతోషిస్తారో?....

జీపు బ్రేకుపడింది. కోర్టు ప్రక్కన చెట్టు క్రింద పాతపెంకుటింటి వద్ద జనం!

'పాపం— చెట్టుక్రింద ప్లీడరు గుండెనొప్పివచ్చి పడిపోయారట్ట!'

'ఆ—కేసు కొడుకు చేతిలో ఓడిపోయారని తెల్సి—'

తెలివొచ్చాక, కన్నీళ్ళతో కన్పించిన కొడుకును చూచి అన్నాడు వెంకట్రామయ్య— "ఏడుస్తున్నావా భానూ? ఎందుకు?...... జీవితంలో ఎన్నడూ పొందని సంతోషాన్ని యివాళే పొందేను. ఎందుకో తెల్సా? నా కొడుకు నాకన్నా న్యాయనిష్ఠ కలవాడని తెల్సుకొని!.... ఆ సంతోషాన్ని హృదయం దాచుకోలేక పోయింది. అందుకే బాబూ యీ హార్టు ఎటేక్! ఎవరన్నా కేసు ఓడిపోయానని తెల్సి యీ ఎటేక్ వచ్చింది, అనుకుంటే వాళ్ళను చూచి జాలిపడు— నిజంగా యీవాళ నాకెంతో ఆనందంగా వుంది....."

ఆ మరుసటిరోజు ఆ సెంటర్లో పెద్ద వేపచెట్టు కింద పాత పెంకుటింట్లో ముసలి కుర్చీలో 'చెట్టు కింద ప్లీడరు' కన్పించలేదు. ఆ సెంటరు సెంటరే బోసి పోయింది! వేప చెట్టు విషాదంగా తలవూపింది.

ఆనాడు గాని ఆయన నిష్ఠతను తెల్సుకోలేక పోయారు ఆ ఊళ్ళోని చాలామంది మనుష్యులు! ●